
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 2 నవంబరు 2024



10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు


ఈదుపురంలో శాంతమ్మ కుటుంబానికి గ్యాస్ సిలిండర్ అందజేస్తున్న సీఎం చంద్రబాబు

- టెక్కలి లేదా పలాసలో ఎయిర్ పోర్టు
- ఇక్కడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- బెంతు ఒరియాల సమస్యలు పరిష్కరిస్తాం
- నదులను అనుసంధానిస్తాం
- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
- టీడీపీ కంచుకోట ఇచ్ఛాపురం
- ఈదుపురం సభలో సీఎం చంద్రబాబు

శ్రీకాకుళం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. భావనపాడు పోర్టు వద్ద 10వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కును నిర్మిస్తున్నామని వెల్లడించారు. శుక్రవారం ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో దీపం-2 పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. లబ్ధిదారు అంబటి శాంతమ్మ ఇంటికి సీఎం వెళ్లి గ్యాస్ పొయ్యిపై స్వయంగా టీ తయారు చేసి అందరికీ అందజేశారు. అనంతరం ఒంటరి మహిళ ఝాన్సీ ఇంటికి వెళ్లి పింఛన్‌ను అందజేశారు. ఆమె కష్టాలను విని చలించిపోయారు. ప్రభుత్వం తరఫున రూ. 2లక్షలు ఆర్థిక సహాయంతో పాటు ఇంటిని నిర్మించి అందిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. అనంతరం సభా ప్రాంగణానికి 2.14గంటలకు చేరుకున్నారు. 3.30 గంటలకు ప్రసంగం ప్రారంభించి, 4.39 గంటలకు ముగించారు. అనంతరం హెలీకాప్టర్‌లో బయల్దేరి శ్రీకాకుళం వెళ్లారు.

టీడీపీ హయాంలోనే పోర్టు..

భావనపాడు పోర్టు వద్ద 10వేల ఎకరాల్లో ఇండస్ట్రీ పార్కును నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. "భావనపాడు పోర్టు టీడీపీ హయాంలోనే ప్రారంభించినా.. వైసీపీ ప్రభుత్వం వచ్చి పేరుమార్చింది. టెక్కలి లేదా పలాస ప్రాంతంలో ఎయిర్ పోర్టును ఏర్పాటు చేసి కనెక్టివిటీ పెంచుతాం. జిల్లా నుంచి ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే ఉద్యోగాలు కల్పించేలా పారిశ్రామికవేత్తలు వచ్చేలా చేస్తాం. నదుల అనుసంధానానికి ప్రాధాన్యత ఇస్తాం. కాలువల ఆధునికీకరణ, ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గాను రూ. 30 కోట్లు మంజూరు చేస్తాం. బెంతు ఒరియాల సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయిలో ఆలోచన చేస్తాం. ప్రస్తుతానికి నేటివిటీ సర్టిఫికెట్ మంజూరు అయ్యేలా తక్షణ చర్యలు తీసుకుంటాం. ప్రతి ఇంటిపై సోలార్ యూనిట్లు ప్రారంభించేందుకుగాను అవసరమైన సహకారం అందిస్తాం. ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎప్పటికీ టీడీపీ కంచుకోటే. ఇక్కడ పది దఫాలు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. తొమ్మిదిసార్లు టీడీపీయే గెలిచింది. 2004లో మాత్రమే ఓటమి చెందింది. కుప్పం, హిందూపురం తర్వాత నాకు అభిమానంగా గుర్తుకువచ్చేది ఇచ్ఛాపురం మాత్రమే. నేను, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో అన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రజాస్వామ్యానికి అందరూ కట్టుబడి ఉండాలి. రాజకీయ ముసుగులో నేరాలు చేస్తామంటే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు. పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేయాలి. వారి ఫోన్‌లను ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేశాం. టెక్నాలజీ ద్వారా ఎవరు ఎక్కడనుంచి పింఛన్ పంపిణీ చేస్తున్నారో నాకు తెలుస్తుంది. ఇసుకను ఉచితం చేశాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా ఉచితంగా తీసుకువెళ్లాలి. ఎవరైనా అడ్డుకుంటే నా దృష్టికి తీసుకురావాలి. మద్యం ధరలు పెంచినా, బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసినా కఠినచర్యలు తీసుకుంటాం. కేంద్రమంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్‌నాయుడు రాష్ట్రంతోపాటు శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేయాలని ముందుగా మాట్లాడుకున్నాం.' అని సీఎం తెలిపారు. సభలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట, పలాస, పాతపట్నం ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, జనసేన నాయకులు పిసిని చంద్రమోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి బాబ్జి, నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి..

ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి పలువురు తమ సమస్యలను తీసుకెళ్లారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.

ఎత్తిపోతల పథకం బాగు చేయాలి..

ఈదుపురంలో జైకిసాన్ ఎత్తిపోతల పథకం బాగుచేయాలి. జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి. ఇక్కడ నుంచి విద్యార్థులు కవిటి వెళ్తున్నారు. బీసీ వసతి గృహం అవసరం. గ్రామంలో బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలి. అప్పట్లో ఎన్టీఆర్ ఇచ్చిన ఇళ్లు ఇప్పుడు పాడయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వలేదు.

-బోర ప్రసాద్, ఈదుపురం

రిజర్వేషన్‌లు ఇవ్వాలి..

మాది కండ్ర కులం. జిల్లాలో లక్ష మంది వరకు ఉన్నాం. ఇచ్ఛాపురం నుంచి కళింగపట్నం వరకు చేపల వేటకు వెళ్తుంటాం. ఎండాకాలంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి జీవిస్తున్నాం. తీరప్రాంత మత్స్యకారుల మాదిరిగా భరోసా ఇవ్వాలి. అన్న క్యాంటీన్‌తో మాకు మేలు జరుగుతుంది. ఇతర రాష్ట్రాల్లో మేము ఎస్సీలుగా ఉన్నాం. మాకు రిజర్వేషన్లు ఇవ్వాలి.

-ఖేత్రొభాసి, ఈదుపురం

రైతులను ఆదుకోవాలి..

ఈదుపురం ఎత్తిపోతల పథకాన్ని రూ.1.3 కోట్లతో ఏర్పాటు చేశారు. ఈ పథకం 2019 నుంచి పాడైంది. 1200 ఎకరాలకు సాగునీరు అందడంలేదు. రైతులను ఆదుకోవాలి. తితలీ తుఫాన్ బాధితులకు మీరు ఇరవై రోజుల్లో సహాయం అందించారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలి బాధితులకు సహాయం అందించలేదు.

-సీపాన వెంకటరమణ, కవిటి


గ్యాస్ పొయ్యిపై టీ చేస్తున్న చంద్రబాబు


సభకు హాజరైన జనం

ఆర్భాటాలకు దూరంగా..

- సీఎం చంద్రబాబు పర్యటన
- అదే జగన్ వస్తేనా..
- అడుగడుగునా ట్రాఫిక్ ఆంక్షలు, నిబంధనలు
- బేరీజు వేసుకుంటున్న జిల్లా ప్రజలు

ఇచ్ఛాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం వచ్చారన్న హడావుడి లేదు. ఆర్భాటం లేదు. అధికారుల ఉరుకులు లేవు.. పరుగులు లేవు. పార్టీ శ్రేణుల సందడి లేదు. ట్రాఫిక్ ఆంక్షలు లేవు. ఆర్టీసీ బస్సుల మళ్లింపు లేదు. ప్రైవేటు స్కూల్ బస్సుల తరలింపు లేదు.. జిల్లాలో సాదాసీదాగా శుక్రవారం సీఎం చంద్రబాబు పర్యటన జరిగింది. ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఉచిత గ్యాస్ పథకానికి ఇచ్ఛాపురం నియోజకవర్గం ఈదుపురంలో సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. అయితే గత ఐదేళ్ల వాతావరణానికి భిన్నంగా సీఎం పర్యటన కొనసాగడం విశేషం. గత ఐదేళ్లలో అప్పటి సీఎం జగన్ జిల్లాకు వస్తున్నారంటే రహదారుల దిగ్బంధం జరిగిపోయేది. పోలీసుల ఆధీనంలోకి వెళ్లిపోయేవి. ట్రాఫిక్‌ను వేరే రూట్లలో మళ్లించేవారు. పట్టణాలు, గ్రామాలను తమ అదుపులోకి తెచ్చుకునేవారు. ప్రజలకు రవాణా కష్టాలు చూపేవారు. ప్రైవేటు పాఠశాలల బస్సులను జనం తరలింపునకు వినియోగించుకునేవారు. దీని వల్ల ఆ స్కూళ్లకు సెలవులను ప్రకటించేవారు. జగన్ వస్తున్న రూట్లో పరదాలు కట్టే బాధ్యతను ఆర్అండ్‌బీకి అప్పగించే వారు. అడ్డంగా ఉందని చెట్లను సైతం నరికివేసేవారు. రోడ్డు డివైడర్లను ధ్వంసం చేసిన సందర్భాలు ఉన్నాయి. హెలిప్యాడ్ నుంచి సభ వరకూ ఫ్లెక్సీలతో నింపేసేవారు. ముందురోజే ప్రజా సంఘాల నేతలను అదుపులోకి తీసుకునేవారు. వామపక్షాల నేతలను గృహనిర్బంధం చేసేవారు. అన్నింటికీ మించి వైసీపీ శ్రేణుల అతి అంతా ఇంతా కాదు. సభకు వస్తారా..పథకాలు పీకేయమంటారా? అన్న హెచ్చరికలు సైతం వినిపించేవి. కానీ శుక్రవారం నాటి సీఎం చంద్రబాబు సభలో మచ్చుకైనా ఈ దృశ్యాలు కనిపించలేదు. కేవలం ఈదుపురం గ్రామస్థుల వరకూ కార్యక్రమాన్ని పరిమితం చేశారు. ఆంక్షలు లేవు. ఎటువంటి నిబంధనలు, హెచ్చరికలు లేవు. అన్నింటికీ మించి ప్రజా జీవనానికి విఘాతం కలిగించకుండా ప్రశాంతంగా పర్యటన సాగింది. దీంతో నాటి సీఎం జగన్‌కు.. నేటి సీఎం చంద్రబాబుకు ఎంత తేడా అంటూ జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆ రోజు ఏమైందంటే..!

- రోజంతా బిజీబిజీగా కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడు
- అర్ధరాత్రి విశాఖ నుంచి కారులో తిరుగు ప్రయాణం
- రణస్థలం సమీపంలో ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు
- శ్రీకాకుళం కిమ్స్‌లో చికిత్స పొందుతూ కన్నుమూత
- నేడు ఎర్రన్నాయుడు వర్ధంతి



ఎర్రన్నాయుడు.. రాజకీయాల్లో ఎన్నటికీ మరువని పేరు. నిమ్మాడ నుంచి ఐక్యరాజ్యసమితి వరకు తన గళం వినిపించిన కృషీవలుడు.ఎన్టీఆర్ చొరవతో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన మూడు దశాబ్దాల కాలం ఆ పార్టీలో కీలక పాత్ర పోషించారు. 1983, 1985, 1989, 1994లో హరిశ్చంద్రాపురం ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలుపొందారు. 1996, 1998, 1999, 2004లో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో కిల్లి కృపారాణి చేతిలో ఒక్కసారి మాత్రమే ఓటమి చవిచూశారు. అసెంబ్లీలో చీఫ్ విప్‌గా రాణించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా కొన్నాళ్లు పనిచేశారు. చంద్రబాబు నాయుడుకు కుడిభుజంగా వ్యవహరించారు. అలాంటి నాయకుడు ఇప్పుడు లేకపోవడం జిల్లా ప్రజలకు తీరని లోటే. 2012వ సంవత్సరం నవంబరు ఒకటో తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత రణస్థలం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన కన్నుమూశారు. నేడు ఆయన 12వ వర్ధంతి సందర్భంగా కథనం..

4లో

నవ్వుల కొండవలస

- కడుపుబ్బా నవ్వించిన లక్ష్మణరావు
- వెయ్యికి పైగా నాటకాల ప్రదర్శన
- 200కు పైగా సినిమాల్లో నటన
- హాస్యనటునిగా రాణింపు
- 'ఐతే.. ఓకే' డైలాగ్‌తో పాపులారిటీ
- నేడు ఆయన వర్ధంతి



సినిమాల్లో తమ నటనతో కామెడీని పండించేవారున్నారు. హావభావాలు ప్రదర్శించి అందర్నీ నవ్వించేవారూ ఉన్నారు. వాయిస్ కామెడీతో కడుపుబ్బా నవ్వించడం కొందరికే సొంతం. ఆ కోవకు చెందినవారే కొండవలస లక్ష్మణరావు. ఔను వాళ్లిద్దరు ఇష్టపడ్డారు చిత్రంతో సినీ ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఆ చిత్రంలో పొట్టిరాజు క్యారెక్టర్‌లో ప్రేక్షకులను అలరించారు. 'నేను ఒప్పుకోను.. ఐతే ఓకే' అంటూ కడుపుబ్బా నవ్వించారు. నేడు ఆయన తొమ్మిదో వర్ధంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

4లో

హామీలు అమలు చేస్తున్నాం

- సీఎం సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు

5లో

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

4లో

సందడిగా దీపావళి


టపాసులు కాలుస్తున్న మంత్రి అచ్చెన్న

కోటబొమ్మాళి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు గురువారం దీపావళి పండగను సందడిగా జరుపుకొన్నారు. సాయంత్రం 5 గంటల నుంచే చిన్నా పెద్దా అంతా బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. కోటబొమ్మాళిలోని ఎన్టీఆర్ భవనంలో కార్యకర్తల మధ్య మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దీపావళిని జరుపుకొన్నారు. టపాసులను కాల్చి, కేకును కట్ చేశారు. పూర్వపు ఆచార వ్యవహారాలను కొనసాగిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

నేడు నిమ్మాడలో ఎర్రన్నకు నివాళి

కోటబొమ్మాళి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు 12వ వర్ధంతిని తన స్వగ్రామం నిమ్మాడ గ్రామంలో శనివారం నిర్వహించనున్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎర్రన్నాయుడు ఘాటు వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, నేతలతో కలసి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి టెక్కలి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, జిల్లాకు చెందిన ముఖ్యనేతలు హాజరుకావాలని అచ్చెన్న పిలుపునిచ్చారు.

టైరు పేలి.. వాహనం బోల్తాకొట్టి..

- 12 మంది కూలీలకు గాయాలు

సోంపేట/టెక్కలి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): వారంతా కూలీలు. సిమెంట్ రోడ్డు పనులు చేపట్టేందుకు వేరే ప్రాంతానికి లగేజీ వ్యాన్‌లో బయలుదేరారు. మార్గమధ్యలో టైరు పేలడంతో వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 12 మంది కూలీలు గాయపడ్డారు. వీరంతా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన సోంపేట మండలం బారువ-కొర్లాం మధ్యలో శుక్రవారం జరిగింది. బారువ ఏఎస్‌ఐ కృష్ణరావు తెలిపిన వివరాల మేరకు.. కంచిలి మండలం పూర్ణశాసనాం గ్రామానికి చెందిన 12 మంది కూలీలు శుక్రవారం ఉదయం బారువ పంచాయతీ గాసరిగూడెం వీధిలో సిమెంట్ రహదారి పనులు చేపట్టేందుకు లగేజీ వ్యాన్‌లో బయలుదేరారు. కొర్లాం సబ్‌స్టేషన్ దగ్గరకు వచ్చేసరికి టైర్ పేలడంతో వాహనం బోల్తాకొట్టింది. ఈ ఘటనలో మామిడిపల్లి రుక్మిణి, కిరామణి, గాయత్రి, దమయంతి, బొబ్బి బెహరా, కైలాష్ బెహరా, తిలోత్తమ బెహరా, శకుంతల బెహరా, రాజు బెహరా, రాజేశ్వరి బెహరా, మురాకుమారి బెహరా తదితరులు గాయపడ్డారు. వీరిని బారువ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన శకుంతల, తిలోత్తమతో పాటు మరో ముగ్గురిని టెక్కలి, శ్రీకాకుళం ఆస్పత్రులకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు, బోల్తాపడిన వ్యాన్

నవ్వుల కొండవలస

- కడుపుబ్బా నవ్వించిన లక్ష్మణరావు
- 200కు పైగా సినిమాల్లో నటన
- 'ఐతే.. ఓకే' డైలాగ్‌తో పాపులారిటీ

నేడు ఆయన వర్ధంతి



ఎచ్చెర్ల/ నరసన్నపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి)

సరుబుజ్జిలి మండలం కొండలవలస గ్రామంలో 1946 డిసెంబరు 10న కొండవలస చలపతి రావు, రాజేశ్వరమ్మ దంపతులకు కొండవలస లక్ష్మణరావు జన్మించారు. లక్ష్మణరావు ప్రాథమిక విద్యాభ్యాసం కోటబొమ్మాళిలో, ఉన్నత విద్య వైజాగ్‌లో పూర్తి చేశారు. చిన్నతనం నుంచి నాటకాలపై ఆసక్తి. కొండవలస తండ్రి రైల్వే ఉద్యోగి కావడంతో ఒడిశాలో కొంత మేరకు ఆయన బాల్యం గడిచింది. ఆ సమయంలో ఓ రోజు బుర్ర కథను చూసిన ఆయన మరుచటి రోజు దాన్ని అనుకరించడం ప్రారంభించారు. ఆ విధంగా తొలిసారిగా ఆయనలోని నటనకు బీజం పడింది. దీంతో కుమ్మరి మాస్టార్ బుర్రకథ బృందంలో ఉండేవారు. తన మేనమామ డబ్బీరు రామాకాంతారావు ప్రోత్సహంతోనే నాటక రంగంలోకి ప్రవేశించారు. 'సవతి తల్లి' నాటికలో బిచ్చగాడు, నౌకరుగా ద్విపాత్రాభినయం పోషించారు. అద్భుతంగా నటించి ఉత్తమ రంగస్థల నటుడిగా అవార్డు అందుకున్నారు. అత్తిలి కృష్ణారావు, చాట్ల శ్రీరాములు వంటి వారి నుంచి నటనలో ఎన్నో మెలకువలు నేర్చుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఎంకాం చదివిన ఆయన నటనలో, డైరెక్షన్‌లో డిప్లమో కూడా పూర్తిచేశారు. విశాఖపట్నం పోర్టుట్రస్ట్ ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తూనే కళల హరి పేరుతో నాటక సంస్థను స్థాపించారు. ఎందరో కళాకారులతో కలసి ఖర్గపూర్, చెన్నై, ముంబాయి, ఢిల్లీ తదితర నగరాల్లో వందలాది నాటక ప్రదర్శనలు ఇచ్చారు. 1980-2011 కాలంలో వెయ్యికి పైగా నాటకాలను ప్రదర్శించారు. రాష్ట్రంలో 76 నాటక కళా పరిషత్‌ల్లో ప్రధాన పాత్రలు పోషించారు. రేపటి శత్రువు అనే నాటకాన్ని 100 సార్లు ప్రదర్శించి రికార్డు సృష్టించారు. స్వార్థం బలితీసుకుంది, హెచ్చరిక, స్వాగతం అనే మూడు నాటకాలను స్వయంగా రాశారు. అలాగే, నటులకు మేకప్ చేయడంలో ప్రావీణ్యం సాధించారు. నవరాగం అనే నాటకానికి ఉత్తమ నటుడు, కేళీ విలాపానికి ఉత్తమ ప్రతినాయకుడిగా దక్కాయి. ఉత్తమ నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా, హాస్య నటుడిగా 378 అవార్డులు, రెండు నంది అవార్డులను నాటకరంగంలో అందుకున్నారు.



నరసన్నపేటలో కొండవలసను సన్మానిస్తున్న శిష్టకరణ సంఘం ప్రతినిధులు (ఫైల్)

దర్శకుడు వంశీ చూసి..

ద్రాక్షారామంలో కొండవలస నటించిన 'అల్లదే మా ఊరు' అనే నాటికను దర్శకుడు వంశీ వీక్షించారు. కొండవలసను ఆప్యాయంగా దగ్గరకు పిలిచారు. 'నాటకం పెద్దగా నచ్చకపోయినా, నీ నటన నన్ను ఎంతో ఆకట్టుకుందంటూ' భుజం తట్టారు. ఇలా వంశీతో కొండవలసకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతోనే 2002లో ఔను వాళ్లిద్దరు ఇష్టపడ్డారు సినిమాలో అవకాశం ఇచ్చారు. పొట్టిరాజు క్యారెక్టర్‌ను ఇచ్చి ప్రోత్సహించారు. 'నీ గొంతులో సీరియస్ ఉంది. ఏదో మార్పు కావాలి. అలాగే కొంచెం కొత్త యాస కావాలి' అని దర్శకుడు చెప్పడంతో, కొండవలస యాస మార్చి డైలాగ్ చెప్పారు. ఆ యాసతో ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నారు. చివరి సినిమా వరకు దానినే కొనసాగించారు. ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'ఎవడి గోల వాడిది' సినిమాలో కామెడీ విలన్‌గా కన్పించారు. 'కబడ్డీ కబడ్డీ'లో కృష్ణారావు క్యారెక్టర్‌తో అందరినీ నవ్వించారు. సత్యం, పందెం, రాఖీ, ఆదివారం ఆడవాళ్లకు సెలవు, పెళ్లాంతో పనేంటి, శ్రీరామచంద్రుడు వంటి 200 పైగా సినిమాల్లో నటించారు. ఆయన ఆఖరి చిత్రం వాసవీ కన్యకాపరమేశ్వరి చరిత. 12 ఏళ్ల పాటు ఖాళీ లేకుండా నటించిన కొండవలస 2015 నవంబరు 2 హైదరాబాద్‌లో మృతిచెందారు. కొండవలస కుమారుడు మణిధర్ సినిమాల్లో దర్శకత్వ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

జిల్లాలో ప్రదర్శనలు..

- 1980లో శ్రీకాకుళం బాపూజీ కళామందిరంలో కొండవలస లక్ష్మణరావు మూడుసార్లు నాటక ప్రదర్శనలు ఇచ్చారు.
- 2009లో నరసన్నపేట నాయుడువీధిలో నిర్వహించిన వినాయక నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఓ కార్యక్రమంలో కొండవలస పాల్గొన్నారు. అప్పటి విశాఖ డిప్యూటీ కలెక్టర్, నరసన్నపేట వాసి పీరు ఎర్రయ్య చేతుల మీదుగా సత్కారం పొందారు.
- శ్రీకాకుళం మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన ఎగ్జిబిషన్‌లో ఇండియన్ గ్యాస్, రేపటి శత్రువు వంటి నాటకాలను ఆయన ప్రదర్శించారు.
- 2012 ఫిబ్రవరి 20న నరసన్నపేటలో రాష్ట్ర శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో కొండవలస లక్ష్మణరావు దంపతులను సత్కరించారు. శిష్టకరణాలను బీసీలో చేర్చే అంశంలో కొండవలస మద్దతు ఇచ్చారని సంఘ నాయకులు సదాశివుని కృష్ణ తెలిపారు.

కోటబొమ్మాళితో విడదీయరాని బంధం..

కొండవలస లక్ష్మణరావుకు తన తాతగారి గ్రామం కోటబొమ్మాళితో విడదీయరాని బంధం ఉంది. తన స్వగ్రామం కొండలవలస అయినా చిన్నతనంలో కోటబొమ్మాళిలోని తన తాతగారు మణిపాత్రుని కాంతం పట్నాయిక్ ఇంట్లోనే ఎక్కువగా ఉండేవారు. నరసన్నపేట, చిన్నబమ్మిడిలో ఉన్న బంధువులు ఇంటికి తరచూ వస్తూ పోతుండేవారు. కోటబొమ్మాళిలోని తాతగారి భూముల వ్యవహారాలను కొండవలస 2013 వరకు స్వయంగా చూసుకునేవారు.

ఆయన మాటలే హాస్యం..



కొండవలస లక్ష్మణరావు మాట్లాడుతుంటే హాస్యంగా ఉంటుంది. ప్రతీ మాటలో ఛలోక్తులు ఉంటాయి. నాటక, సినిమా రంగాల్లో రాణించి జిల్లా కీర్తిప్రతిష్ఠలను పెంపొందించారు. వంశీ దర్శకత్వంలో చేసిన సినిమాల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. విలక్షణమైన నటనతో, హావభావాలతో నవ్వించేవారు. కొండవలస మన జిల్లావాసి కావడం గర్వకారణం.

-ఏపీవీపీ రమణమూర్తి,
కొండవలస సమీప బంధువు, నరసన్నపేట

ఆ రోజు ఏమైందంటే..!

- రోజంతా బిజీబిజీగా కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడు
- అర్ధరాత్రి విశాఖ నుంచి కారులో తిరుగు ప్రయాణం
- రణస్థలం సమీపంలో ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు
- శ్రీకాకుళం కిమ్స్‌లో చికిత్స పొందుతూ కన్నుమూత

నేడు ఎర్రన్నాయుడు వర్ధంతి



కింజరాపు ఎర్రన్నాయుడు



ప్రమాదానికి గురైన కారు ఇదే..



టెక్కలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అది 2012వ సంవత్సరం నవంబరు ఒకటో తేదీ. కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ఆ ఒక్క రోజే జిల్లాలో 15కు పైగా పెళ్లిళ్లకు హాజరయ్యారు. ఉదయం మందస ఎంపీపీ సీర నాగేశ్వరరావు అంత్యక్రియలకు హాజరయ్యారు. ఆ తరువాత సారవకోట మండలం ధర్మపురం గ్రామంలో ఓ కార్యకర్త పెళ్లికి హాజరయ్యారు. రాత్రి 9 గంటల సమయంలో శ్రీకాకుళంలో కలమట వెంకటరమణ బంధువుల పెళ్లికి కూడా హాజరై.. 9.30 గంటలకు తన నివాసమైన ప్రజాసదన్‌కు చేరుకున్నారు. ఆ తరువాత ఎచ్చెర్ల టీడీపీ నాయకులు నాయని సూర్యనారాయణరెడ్డి సోదరుడి కుమార్తె పెళ్లికిగాను విశాఖలో గల పాంబీచ్ హోటల్‌కు అప్పటి జిల్లా టీడీపీ అధ్యక్షులు చౌదరి బాబ్జీ కారులో ఎర్రన్న బయలుదేరారు. అక్కడి నుంచి అర్ధరాత్రి 12 గంటల తరువాత శ్రీకాకుళానికి తిరుగు ప్రయాణమయ్యారు. రాత్రి 1.30-2గంటల సమయంలో రణస్థలానికి సమీపంలోని దన్నానపేట జంక్షన్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న ఆయిల్ ట్యాంకర్‌ను ఎర్రన్నాయుడు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ముందుసీటులో ఎర్రన్నాయుడు, మధ్య సీటులో చౌదరి బాబ్జీ, బుడితికి చెందిన పొన్నాన సీతారామనాయుడు, పార్టీ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు, బెండి మల్లేసు, రాంబాబు, డ్రైవర్ శ్రీధర్‌లు ఉన్నారు. ఈ సంఘటన జరిగిన సమయంలో కారులో ఉన్న ఎర్రన్నాయుడుతో పాటు చౌదరి బాబ్జీ నుదిటికి, సీతారామనాయుడు ఎడమ కాలు, చేతికి, కలిశెట్టి అప్పలనాయుడుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎన్‌హెచ్5 అంబులెన్స్‌లో శ్రీకాకుళం దరి కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆ అంబులెన్స్‌లో ఆక్సిజన్ లేకపోవడంతో ఎర్రన్నాయుడు పరిస్థితి విషమంగా మారింది. 2వ తేదీ తెల్లవారు జామున కన్నుమూశారు. ఎర్రన్నాయుడు కారులో ప్రయాణించే సమయంలో అప్పట్లో టీడీపీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న సుజనా చౌదరితో ఫోన్‌లో మాట్లాడారు. 'చంద్రబాబు ఖమ్మంలో ఉన్నారు. రేపు బొత్స సత్యనారాయణ కుమార్తె పెళ్లి అనంతరం నేను వచ్చి కలుస్తా'నని సుజనా చౌదరికి చెప్పారు.



ఎర్రన్న వారసుడిగా రామ్మోహన్ నాయుడు

- 25 ఏళ్ల వయసులోనే రాజకీయాల్లోకి..

టెక్కలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రన్నాయుడు మరణించే నాటికి రామ్మోహన్‌నాయుడు వయస్సు సరిగ్గా 25 సంవత్సరాలు. ఆ సమయంలో రామ్మోహన్ నాయుడికి తండ్రి ఎర్రన్నాయుడి వారసుడిగా రాజకీయాల్లోకి రావాలని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, లోకేష్ పిలుపునిచ్చారు. దీంతో రామ్మోహన్ నాయుడు రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2013-14 మధ్యకాలంలో జిల్లా అంతటా సైకిల్ యాత్ర చేశారు. ఎర్రన్నాయుడి వారసుడిగా ప్రజలకు పరిచయమయ్యారు. ఆ తరువాత 2014 ఎన్నికల్లో శ్రీకాకుళం నుంచి పార్లమెంట్‌కు పోటీ చేసి గెలుపొందాడు. మూడు పర్యాయాలు పార్లమెంట్ సభ్యునిగా గెలుపొంది నేడు ఎన్డీఏ ప్రభుత్వంలో కేంద్ర పౌర, విమానయాన శాఖ మంత్రిగా పనిచేస్తూ తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు.

చంద్రబాబుతో కలసి వచ్చిన రామ్మోహన్..

అమెరికాలో ఉన్నత చదువులు పూర్తి చేసుకొని సింగపూర్‌లో ఉద్యోగం చేసు కుంటున్న కింజరాపు రామ్మోహన్ నాయుడు.. తండ్రి ఎర్రన్నాయుడు మరణించే సమయానికి న్యూఢిల్లీలో ఉన్నారు. తండ్రి మరణ వార్త విని హైదరాబాద్ చేరుకున్నారు. అక్కడి నుంచి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడితో కలిసి నిమ్మాడ చేరుకున్నారు. ఆ క్షణంలో తన కుడి భుజాన్ని కోల్పోయానని చంద్రబాబుతో సహా కుటుంబ సభ్యులందరూ కన్నీటి పర్యంతమయ్యారు. ఎర్రన్నాయుడు మృతదేహానికి నవంబరు 3న అంత్యక్రియలు నిర్వహించారు.

ఎర్రన్నను కాపాడేందుకు..

- చివరి వరకూ ప్రయత్నించిన దంపతులు
- నాటి ఘటనను గుర్తుచేసుకుని కన్నీటిపర్యంతం



భాస్కరరావు, లక్ష్మి

రణస్థలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అది 2012 నవంబరు 1 అర్ధరాత్రి 1.45 గంటలు. రణస్థలం మండల కేంద్రంలో ఆయిల్ ట్యాంకర్‌ను కారు ఢీకొట్టింది. భారీ శబ్దం రావడంతో సమీపంలో ఉంటున్న దంపతులు పరుగెత్తుతూ అక్కడికి చేరుకున్నారు. అక్కడ గాయాలతో ఉన్నది జిల్లా ప్రజల అభిమాన నేత ఎర్రన్నాయుడు. ఆ దృశ్యాన్ని చూసిన దంపతుల నోట మాట రాలేదు. క్షణాల్లో ఇంటికి వెళ్లి మంచినీరు తెచ్చారు. సపర్యలు చేశారు. తమ వద్ద ఉన్న కారులో ఎక్కించి ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. కానీ వీలు కాలేదు. ఇంతలో 108 అంబులెన్స్ రావడం.. హుటాహుటిన తరలించడం..అక్కడ చికిత్స పొందుతూ ఎర్రన్నాయుడు తుది శ్వాస వీడడం జరిగిపోయింది. ఈ ఘటన జరిగి పుష్కర కాలం అవుతున్నా... ఎర్రన్నతో గడిపిన చివరి క్షణాలను తలుచుకొని ఆ దంపతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వారే రణస్థలం మండల కేంద్రానికి చెందిన గాజుల భాస్కరరావు, లక్ష్మి దంపతులు. ఎర్రన్న వర్ధంతి సందర్భంగా వారిని 'ఆంధ్రజ్యోతి' కలవగా... నాడు ఏం జరిగిందో కళ్లకు కట్టినట్టు చెప్పారు. ఆ రోజు అర్ధరాత్రి వేళ... నాటి టీడీపీ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తికి చెందిన వాహనంలో వస్తున్నారు కింజరాపు ఎర్రన్నాయుడు. సరిగ్గా రణస్థలం మండల కేంద్రం సమీపంలోకి వచ్చేసరికి చిన్నపాటి చినుకులు ప్రారంభమయ్యాయి. యూటర్న్ వద్ద ఆయిల్ ట్యాంకర్ టర్న్ అవుతోంది. ఆ సమయంలో ట్యాంకర్‌ను ఢీకొట్టింది కారు. అదే సమయంలో సమీపంలోని ఇంట్లో మెలకువగా ఉన్నారు భాస్కరరావు, లక్ష్మి దంపతులు. స్థానిక మద్యం షాపులో పనిచేసే భాస్కరరావు స్టాకు రావడంతో దానిని దించి అప్పుడే ఇంటికి చేరుకున్నారు. ఇంతలోనే ఈ ప్రమాదం సంభవించింది. వెంటనే ఆ దంపతులు ఎర్రన్నాయుడిని తమ ఒడిలోకి తీసుకొని సపర్యలు చేశారు. తమ వద్ద ఉన్న మారుతీ కారులో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు శతవిధాలా ప్రయత్నం చేశారు. కానీ ఎర్రన్న భారీ మనిషి కావడంతో అందులో తరలించేందుకు వీలుపడలేదు. ఆ సమయంలో కారులో ప్రస్తుత ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అప్పటి టీడీపీ జిల్లా అధ్యక్షుడు చౌదరి బాబ్జీ, ఎచ్చెర్ల టీడీపీ నేత బెండు మల్లేశ్వరరావు, సీతారాంనాయుడు, బువనరాం బాబు తదితరులు ఉన్నారు. వారంతా క్షతగాత్రులు కావడంతో భాస్కరరావు, లక్ష్మి దంపతులు ఎర్రన్నను కాపాడుకునేందుకు తుది వరకూ ప్రయత్నించారు. కానీ కాపాడుకోలేకపోయామని ఆ దంపతులు కన్నీటి పర్యంతమయ్యారు.



పార్టీ కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న చంద్రబాబు

2047-స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యం

- కార్యకర్తల త్యాగఫలమే ఈ విజయం
- పార్టీ జెండా మోసేవారికే గుర్తింపు
- ఇది అధికారం కాదు.. బాధ్యత
- తప్పు చేసిన వారు తప్పించుకోలేరు
- తాత్కాలిక ప్రలోభాలకు పోవద్దు
- కక్షపూరిత రాజకీయాలు చేయను.. నేరస్తులను విడిచిపెట్టను
- మరో 50 ఏళ్లు బలంగా ఉండేలా పార్టీ నిర్మాణం
- సీఎం చంద్రబాబునాయుడు

అరసవల్లి/అర్బన్/స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పని చేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురం పర్యటన అనంతరం శ్రీకాకుళం చేరుకున్న చంద్రబాబు...జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఎంతోమంది కార్యకర్తలు, నాయకుల త్యాగఫలమే 2024 ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయానికి మూల కారణమని అన్నారు. కార్యకర్తల రుణం తీర్చుకోవడం తన బాధ్యత అని భావోద్వేగంతో చంద్రబాబు చెప్పారు. 40 ఏళ్ల పాటు జెండాను భుజాన మోసిన కార్యకర్తలను పార్టీ ఎన్నటికీ విస్మరించదని స్పష్టం చేశారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం జిల్లాలో అచ్చెన్న అరెస్టుతో మొదలుకొని, కార్యకర్తల వరకూ వేధిస్తూ పైశాచిక ఆనందం పొందిందన్నారు. కక్షపూరిత రాజకీయాలకు టీడీపీలో చోటు లేదని స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారిని వదిలేది లేదని హెచ్చరించారు. ప్రజలు తనపై, పార్టీపై ఉన్న విశ్వాసంతో శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు కేవలం రెండు స్థానాల్లో తప్ప పూర్తి అధికారాన్ని కల్పించారన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే... 'సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పని చేశాను. కానీ ఎన్నడూ ఇంతటి పని ఒత్తిడిని ఎరుగను. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒక రౌండ్ సమీక్షలు పూర్తి చేశాం. గత ఐదేళ్లలో రూ.10 లక్షల 50 వేల కోట్లు అప్పులు చేశారు. ఎమ్మార్వో కార్యాలయాలు, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలను కూడా తాకట్టు పెట్టిన దుస్థితి వైసీపీ దుర్మార్గ పాలనలో దాపురించింది. అవకాశం లేక కానీ టీడీపీ కార్యాలయాలను కూడా తాకట్టు పెట్టేవారే. మద్యం, ఇసుక, భూముల కబ్జాలు.. ఇలా అన్ని వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేశారు.

నిజాయితీ గల వారికి గుర్తింపు..

నిజాయితీగా పనిచేసే కార్యకర్తలకు పనితీరే అర్హతగా రాబోయే రోజుల్లో ట్రస్టు బోర్డులు, కార్పొరేషన్లు, స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యం కల్పిస్తాం. మరో 50 సంవత్సరాల పాటు పార్టీ బలంగా ఉండేందుకు ఈ ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేశాం. జిల్లాలో గొండు శంకర్, మామిడి గోవిందరావు, కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం నుంచి కొండపల్లి అప్పలనాయుడి మనుమడు కొండపల్లి శ్రీనివాస్‌లకు అవకాశం కల్పించాం. బీసీలకు అత్యధిక స్థానాలు కేటాయించిన పార్టీ టీడీపీయే. రాబోయే రోజుల్లో వెనుకబడిన వర్గాలకు ఆర్థికంగా, రాజకీయంగా ప్రాధాన్యం కల్పిస్తాం. కార్యకర్తల గౌరవాన్ని పెంచుతూ, వారి ద్వారానే ప్రజల సమస్యలను తీర్చేందుకు శ్రీకారం చుట్టాం. సమర్థవంతమైన నాయకత్వాన్ని తీసుకువచ్చి పార్టీ సేవలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత నాపై ఉంది. నేను కేవలం ట్రస్టీని మాత్రమే. కార్యకర్తలు, నాయకులు ఎన్టీఆర్ స్ఫూర్తితో పార్టీని ముందుకు తీసుకెళ్లాలి. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రిగా యువకుడైన కింజరాపు రామ్మోహన్‌నాయుడికి అవకాశం కల్పించాం. గతంలో ఎర్రన్నాయుడు, అశోక్ గజపతి రాజులకు కూడా ఈ అవకాశం కల్పించాం. పదవుల కోసం పనిచేసే పార్టీ టీడీపీ కాదు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే పార్టీ. సరైన వ్యక్తిని సరైన స్థానంలో నిలబెడితేనే నిజమైన అభివృద్ధి సాధ్యపడుతుంది. ఆ దిశగా క్షేత్రస్థాయిలో ఉన్న నాయకులను గుర్తించాలి. జనసేన, బీజేపీ కూటమితో కలిసి అందరూ పని చేయాలి. కూటమి ప్రభుత్వంలో ఉండడం వల రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.10,500 కోట్లు, పోలవరానికి రూ.12,500 కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం రూ.2,500 కోట్లు తీసుకు రాగలిగాం. ఇప్పటి వరకు 7.70లక్షల సభ్యత్వ నమోదు పూర్తయింది. ఈ స్థాయిలో నమోదు చేయడం శుభ పరిణామం. రాబోయే 2029 ఎన్నికలకు నేటి నుంచే కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలి.

అధికారాన్ని దుర్వినియోగం చేయొద్దు..

అధికారాన్ని దుర్వినియోగం చేస్తే సహించబోను. అది టీడీపీ నాయకులైనా, కార్యకర్తలైనా ఒకటే. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో నేరస్తుల అడ్డాగా వైసీపీ పాలన సాగింది. రాజకీయ ముసుగులో రాష్ట్రాన్ని దోచుకున్నారు. అరెస్టుల పేరుతో టీడీపీ కార్యకర్తలనే కాకుండా ప్రజలను కూడా హింసించారు. వ్యవస్థలను భ్రష్టు పట్టించి... రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు. నేరస్తులను విడిచిపెట్టేది లేదు. ప్రజాహితం కోసం పని చేయడంలో రాజీ పడేది లేదు. 2014లో నరేగా పనులకు గాను బిల్లులు చెల్లించాల్సి ఉంది. వాటి వివరాలను జిల్లా అధికారులకు అందజేస్తే... త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం. టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టిన వారి వివరాలను పార్టీ కార్యాలయానికి అందజేయాలి. నీరు-చెట్టు వివరాలను అందించాలి' అని చంద్రబాబు సూచించారు.

బాబుకు ఘన స్వాగతం..

ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద దిగిన చంద్రబాబు నాయుడికి పార్టీ కార్యకర్తలు, మంత్రులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా వెళ్లి ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కార్యాలయాన్ని సీఎం పరిశీలించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కె.శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణ, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు, గౌతు శిరీష, కూన రవికుమార్, ఎన్.ఈశ్వరరావు, ఎమ్మెల్సీ చిరంజీవులు, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

అరసవల్లి/అర్బన్/స్పోర్ట్స్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఇందుకు జిల్లా అధికారులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ ప్రతి ఇంటికి తాగునీరు, విద్యుత్, గ్యాస్, మరుగుదొడ్లు, ఉండాలన్నారు. వాటితోపాటు విద్య, వైద్యం, రోడ్లు, వీధి దీపాలు, కాలువలు వంటి అవసరాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వంలో ఇసుక అమ్మకాల్లో భారీ అక్రమాలు జరిగాయన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక ఇసుకను పూర్తిగా ఉచితం చేశామన్నారు. ఇసుక, మద్యం విషయంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే జైలుకు పంపించేందుకు కూడా వెనుకాడబోమన్నారు. జిల్లాలో కొన్ని అధిక ప్రాధాన్య అంశాలు చేపడతామన్నారు. ఇందులో రూ.4,360 కోట్లతో మూలపేట పోర్టు అక్టోబరు 2025 నాటికి పూర్తికానుందన్నారు. మూలపేట నుంచి భోగాపురం వరకు బీచ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. వంశధార ఎడమ కాలువ పనులు చేపట్టాల్సి ఉందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరగా ప్రాధాన్య క్రమంలో తీసుకుంటామని సీఎం చెప్పారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు తమనియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను వివరించారు. అరసవల్లి దేవాలయం సుందరీకరణ, అభివృద్ధి పనులకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్టు కలెక్టర్ వివరించారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చాలామంది లబ్ధిదారులకు గృహ నిర్మాణ బిల్లులు అందలేదన్నారు. సమావేశంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, వేపాడ చిరంజీవి, ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బెందాళం ఆశోక్, మామిడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తున్నాం



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

● సీఎం సభలో పలువురు నేతలు

శ్రీకాకుళం/ ఇచ్ఛాపురం/ కంచిలి/ సోంపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సభలో పలువురు నేతలు మాట్లాడారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. 'గత ఐదేళ్లలో ఇచ్ఛాపురం నియోజవర్గంలో ఏ ఒక్కరు మొహంలో చిరునవ్వు ఉండేది కాదు. ఇప్పుడు అందరూ తలెత్తుకుని తిరుగుతున్నారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. 2014-19 వరకు ఎంతగానో అభివృద్ధి చేశాం. 2019లో ఒక్క అవకాశం ప్రజలు ఇస్తే రాష్ట్రాన్ని జగన్ అధోగతి చేశాడు. ఇచ్ఛాపురం ప్రాంతానికి నీరు ఇచ్చిన ఘనత చంద్రబాబు, ఎర్రన్నాయుడిదే. ఈ ఐదేళ్లలో ఉద్దానం ప్రాంతానికి పరిశ్రమలు తేవాలని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారు. ఎక్కువ శాతం ఉద్యోగాలు ఇచ్చేలా కృషి చేస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజాప్రతినిధులు టీమ్ వర్క్‌గా పనిచేస్తున్నారు. జీడి, కొబ్బరి బోర్డులు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలి.' అని తెలిపారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి 164 స్థానాలు ఇచ్చారు. సూపర్ సిక్స్‌లో రెండో పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నాం. 2019లో ఓ దుర్మార్గుడు సీఎంగా వచ్చి ఐదేళ్లు రాష్ట్రాన్ని దోపిడీ చేశాడు. ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నాశనం చేశాడు. ఎక్కడైనా అప్పుతెద్దామంటే అన్నీ తాకట్టుపెట్టేశాడు జగన్. చివరకు రైతు బజారులను కూడా తనకా పెట్టేశాడు. ఈ సమయంలో చంద్రబాబు కాకుండా ఇంకెవరైనా ఉంటే వారు దండం పెట్టేసి వెళ్లిపోయేవారు. జూన్ 12 నాటికి రాష్ట్ర ప్రభుత్వం వెంటిలేటర్‌పై ఉంది. ఈ ఐదు మాసాలు మోదీ, పవన్, చంద్రబాబు సమర్థవంతంగా పనిచేసి ఆక్సిజన్ పీల్చుకునేస్థాయికి రాష్ట్రాన్ని తీసుకువచ్చారు. ఈరోజు వలంటీర్లు లేకుండా 5.30 గంటలకే 95శాతం పింఛన్లు ఇచ్చారు. ఒక ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పాం. ఓ పద్ధతి ప్రకారం సిలిండర్లు ఇస్తుంటే ఓ పనికిమాలిన టీవీ విమర్శలు చేస్తుంది. తల్లిని, చెల్లిని కోర్టుకు లాగాడంటే.. అటువంటి వ్యక్తి ప్రజలకు ఏమి మంచిచేస్తాడు. ఆ దుర్మార్గుడు వస్తే ఆయన వెంట పదిమంది వెళ్తున్నారు. అటువంటి వ్యక్తి నీడ రాష్ట్రంపై పడకూడదు. ఈ ప్రాంతంలో సదరం సెంటర్‌ను ఏర్పాటు చేయాలి. వంశధార-బహుదా నదులు అనుసంధానం చేసేందుకు రూ.6,500 కోట్లతో టెండర్లు పిలిస్తే.. తర్వాత వచ్చిన దుర్మార్గ ప్రభుత్వం వాటిని రద్దుచేసింది. ఓ రోజు ఆలస్యమైనా ఇచ్చిన ప్రతి హామీని' అమలు చేస్తామని తెలిపారు.

జగన్ రూ.41వేల కోట్ల అప్పులు చేశాడు..

రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. 'సివిల్ సప్లయ్ శాఖలో రూ.41వేల కోట్ల అప్పు చేసి గత ముఖ్యమంత్రి జగన్ వెళ్లిపోయాడు. ఇప్పుడు చంద్రబాబు సీఎం కాగానే రూ.16వేల కోట్లు రైతుల కోసం ప్రభుత్వం నుంచి విడుదల చేశారు. అప్పట్లో పది లక్షల మందికి దీపం కనెక్షన్ ఇచ్చారు. ఇప్పుడు కోటి 50 లక్షల మంది అర్హత కలిగినవారికి ఉచిత సిలిండర్లు ఇస్తున్నారు. మేము ప్రతి ఏడాది మూడు సిలిండర్లు ఇస్తున్నాం. ప్రజల్లో వైసీపీ అనవసరంగా రాద్ధాంతం చేస్తుంది. ఇక్కడ నుంచి వలసలు పోకూడదు. అద్భుతమైన పాలన అందిస్తాం' అని అన్నారు.

నదులు అనుసంధానం చేయాలి

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడుతూ.. 'వంశధార నదిని బహుదాలో అనుసంధానం చేయాలి. ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడి నేరడి సమస్యను తీర్చాలి. ఇక్కడ మేజర్ ఇరిగేషన్ అంటూ ఏమీలేవు. కాలువల్లో పూడికతీత పనులను యంత్రాలతో చేపట్టాల్సిఉంది. మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల్లో డీసిల్టేషన్ చేయాల్సి ఉంది. హార్టీకల్చర్‌కు సంబంధించి ఇక్కడ కోకోనట్ పార్క్ ఏర్పాటు చేయాలి. ఎన్టీఆర్ సుజల పథకం ప్రస్తుతం పడకేసింది. కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్ సెంటర్లు పెట్టాం. డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి. ఇచ్ఛాపురంలో డయాల్సిస్ సెంటర్, ఈదుపురంలో జూనియర్ కళాశాలను నెలకొల్పాలి. 25వేల మంది బెంతు ఒరియాలు స్థానికంగా ఉన్నా వారికి నేటివిటీ సర్టిఫికెట్ లేదు. ఇక్కడ జెట్టీ నిర్మించాలి.' అని కోరారు.

ముఖ్యమంత్రితో మాట్లాడిన లబ్ధిదారులు

అంబటి పుష్పలత.. 'నేను ఇంటర్ చదువుకున్నాను. కూటమి ప్రభుత్వం రావడం సంతోషంగా ఉంది. ప్రతి కుటుంబానికి ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇవ్వడం వల్ల ఆర్థికంగా లాభం కలుగుతుంది. మాది కట్టిలపొయ్యి సర్. చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు పరిస్థితి మారింది. అన్న క్యాంటీన్ ద్వారా రూ.5కే భోజనం పెట్టారు సర్. రూ.5కి టీ కూడా లభించడం లేదు. ఇది చాలా గొప్పవిషయం. కష్టకాలంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే మా వెంట ఉంటారు.' అని తెలిపింది.

● **ఆరుద్రమ్మ:** 'నేను చదువుకోలేదు సార్.. నాది మధ్య తరగతి కుటుంబం. అప్పుడు ఎన్టీఆర్ రూ.70 వరకు పింఛన్‌ను మా అమ్మకు ఇచ్చారు. ఇప్పుడు చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం తొలివిడతలోనే రూ.7వేలు ఇచ్చారు. ఎల్లకాలం మీరందరూ గెలుపొందాలి.' సార్.

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పరిశీలన

కలెక్టరేట్/అర్బన్/స్పోర్ట్స్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా శ్రీకాకుళంలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం సాయంత్రం నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనాలను పరిశీలించారు. ఈ నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. త్వరలోనే పూర్తి చేయిస్తామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్ స్వప్నిల్ పుండ్కర్ ఉన్నారు.



నూతన కలెక్టరేట్ భవనం గురించి వివరిస్తున్న అధికారి

సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి

ఇచ్ఛాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరావు, ఇచ్ఛాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు విజ్ఞప్తి చేశారు. ఉద్దానాన్ని వేధిస్తున్న కిడ్నీ వ్యాధులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని కోరారు. వంశధార-బాహుదా నదుల అనుసంధానం, మత్స్యకారుల జీవన ప్రమాణం మెరుగు పరచాలని, జీడి, కొబ్బరి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే బెంతు ఒరియా కులస్థుల సమస్యలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించడంతో వారంతా హర్షం వ్యక్తం చేశారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు

జిల్లా పర్యటనకు శుక్రవారం వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబును పలువురు ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలుసు కున్నారు. పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

- ఆంధ్రజ్యోతి బృందం



అరసవల్లి: చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్



పాతపట్నం: ఎమ్మెల్యే మామిడి గోవిందరావు..



పలాస: ఎమ్మెల్యే గౌతు శిరీష..



ఆమదాలవలస: ఎమ్మెల్యే రవికుమార్..



నరసన్నపేట: ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి..

కూటమి నేతల కుమ్ములాట

లావేరు: బుడుమూరులో శుక్రవారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఎదుటే కూటమి నాయకులు కుమ్మి లాడుకున్నారు. గతంలో టీడీపీలో ఉన్న మాజీ సర్పంచ్ పెదనాయుని శ్రీరాములు నాయుడు ఇటీవలన జరిగిన సార్వత్రిక ఎన్నికలు ముందు పార్టీకి దూరంగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామంలోని రెండో కేడర్‌కు చెందిన నల్లి లక్ష్మునాయుడు, మాజీ ఎంపీటీసీ పండి గోపాలరావు టీడీపీ జెండాను మోశారు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీకి వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేలు శ్రీరాములు నాయుడు మద్దతుదారులకు తొలుత పింఛన్లు అందించి, తర్వాత లక్ష్మునాయుడు, గోపి ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు వచ్చి వీరు చూపించిన లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడంపై నల్లి, పండి వర్గీయులు ఆవేదన వ్యక్తం చేశారు. కలిసికట్టుగా పని చేయాలని ఎంపీ, ఎమ్మెల్యే కూటమి నాయకులకు సూచించారు.

బాధ్యతలు చేపట్టిన న్యాయాధికారులు

గుజరాతీపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కోర్టుల సముదాయంలో కొత్తగా వచ్చిన న్యాయాధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి, మూడో అదనపు జిల్లా న్యాయాధికారిగా ఉన్న పి.భాస్కరరావును మొదటి అదనపు జిల్లా న్యాయాధికారిగా నియమితులయ్యారు. అదేవిధంగా రాజాం అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారిగా ఉన్న సీహెచ్ వివేకానంద శ్రీనివాసరావును మూడో అదనపు న్యాయాధికారి గా నియమించారు. వీరిని ఫ్యామిలీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఆంధ్ర ప్రదేశ్ టెన్యూల్ పీపీల వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వాన కృష్ణచంద్, పీపీలు చింతాడ సత్యనారాయణ, లోలుగు వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

అరసవల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు బి.మురళి, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాసుపత్రి ఆవరణలో శానిటేషన్ సిబ్బంది రిమ్స్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రిమ్స్ సూపరింటెండెంట్ షకీలా కార్మికుల వద్దకు వచ్చి సమస్యల హామీ ఇవ్వడంతో విధుల్లో చేరారు. యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

శివానీలో ఘనంగా ఫ్రెషర్స్ డే



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

ఎచ్చెర్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా చదువుకుని లక్ష్యసాధన దిశగా అడుగులేయాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు వీఎం సాయినాథరెడ్డి, కె.దుర్గాశ్రీనివాస్, పి.దుర్గాప్రసాద్‌రాజు, డి.వెంకటరావు, ఎస్.శ్రీనివాసరావు, జె.హరీష్, కూటమి నేతలు బెండు మల్లేశ్వరరావు, లంక శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి ఇందిరమ్మ

ఆమదాలవలస, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల పెన్నిధి దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. గురువారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గేటు సెంటర్ వద్ద గల ఆమె విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొడ్డేపల్లి గోవింద్ గోపాల్, లఖినేని నారాయణరావు, బస్వా షన్ముఖరావు, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, పైడి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమదాలవలస నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. పార్టీ నాయకులు అప్పారావు, శ్రీనునాయుడు, రాజశేఖర్, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పొందూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కింతలి గ్రామానికి చెందిన చిన్నారి వైద్య ఖర్చులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.4లక్షల చెక్‌ను ఆమె తల్లిదండ్రులు సీపాన పవన్‌కుమార్, సాయిలక్ష్మిలకు ఎమ్మెల్యే రవికుమార్ అందించారు. ఎంపీటీసీ కె.హనుమంతులరావు, మాజీ సర్పంచ్ డి.గణపతి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తాపడి ఏడుగురు విద్యార్థులకు గాయాలు




గాయపడిన విద్యార్థినులను పరామర్శిస్తున్న డీఈవో తిరుమల చైతన్య

మెళియాపుట్టి/టెక్కలి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండల కేంద్రం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జలగ లింగుపురం గ్రామానికి చెందిన విద్యార్థులు కొసమాళ జడ్పీ హైస్కూల్‌లో చదువు తున్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు మెళియాపుట్టిలో ప్రైవేటుకు వెళ్లి అక్కడి నుంచి కొసమాళ వెళుతుంటారు. ఎప్పటిలాగే శుక్రవారం కూడా గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పి.ఫల్గుణరావు గ్రామం నుంచి మెళియాపుట్టి విద్యార్థులను తీసుకు వస్తుండగా మెళియా పుట్టికి చెందిన ఓ వ్యాపారికి సంబంధించిన లగేజీ ఆటో కోళ్ల వ్యర్థాలను ఊరి బయట పడవేసి తిరిగి వెళ్తూ విద్యార్థులను తీసుకు వెళుతున్న ఓవర్‌టేక్ చేసి ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. దీనిలో ప్రయాణిస్తున్న కె.బాల కృష్ణ, ఎన్.నాగచైతన్య, ఎన్.మేఘన, ఎ.విష్ణుప్రియ, ఎన్.పవన్‌సాయి, ఎన్. దనుశ్రీ, ఆర్.హేమలతలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే మెళియా పుట్టి పీ హెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. వీరికి ఎటువంటి ప్రాణా పాయం లేదని డా.జి.గణపతిరావు తెలిపారు. టెక్కలిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను డీఈవో తిరుమల చైతన్య పరామర్శించి వైద్యులతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఎంఈవో పద్మనాభరెడ్డి, సర్పంచ్ అనూరాధ గణపతిరావు తదితరులు పరా మర్శించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నర్సింగరావు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు

కోటబొమ్మాళి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): టెక్కలి గ్రామానికి చెందిన సాహు కారు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో కోటబొమ్మాళి సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేసి బదిలీపై వెళ్లిన గురువిల్లి రాజుతోపాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. టెక్కలికి చెందిన సుజాతకు చెందిన స్థలాన్ని రఘునాథపురానికి చెందిన పొట్నూరు జోగారావు అతని పేరుపై తప్పుడు పత్రాలు రాయించుకుని దానిని ఆయన భార్య తులసమ్మ పేరున కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజి స్ట్రేషన్ చేయించారు. అయితే తన భర్త మృతి తరువాత కోల్‌కతాలో నివాసం ఉం టున్నందున తనకు ఈ విషయం తెలియలేదని, ఇటీవల తాను ఆ స్థలంపై కోట బొమ్మాళి మండలం చిన్నసానకు చెందిన ఉప్పర అప్పన్న, ఎండ నాగేశ్వర రావు లకు భూహక్కు ఇచ్చానని, అయితే దీనికి సంబంధించి లింక్ డాక్యుమెంట్లు, ఇతర సమాచారం పరిశీలించేసరికి ఈ స్థలాన్ని జోగారావు భార్య తులసమ్మ పేర రిజి స్ట్రేషన్ అయినట్లు తెలియడంతో సదరు వ్యక్తి వద్దకు వెళ్లినా పత్రాలు చూపించి నా భూమిని ఎలా దఖలు పరచుకున్నావని ప్రశ్నించగా.. ఇప్పుడు ఇది నా భూమి.. భూమిపైకి ఎవరొచ్చినా చంపేస్తానని బెదిరించారని సుజాత ఆ ఫిర్యాదులో పేర్కొ న్నారన్నారు. దీంతో రిజిస్ట్రార్, జోగారావు, భార్య తులసమ్మతో పాటు డాక్యుమెంట్ రైటర్‌లపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆమె ఫిర్యాదులో పేర్కొ న్నారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యాన్ ఢీకొని మహిళ మృతి



పైడమ్మ (ఫైల్)

ఎచ్చెర్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కుప్పిలి గ్రామం లో గురువారం లగేజి వ్యాన్ ఢీకొని అదే గ్రామానికి చెందిన పిలక పైడమ్మ(58) మృతిచెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దీపావళి పండగ రోజున తాగునీటి కోసం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా.. లగేజి వ్యాన్ ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. వ్యాన్ డ్రైవర్ బ్రేక్‌పై వేయాల్సిన కాళ్లను గేర్లపై వేయడంతో ఒక్క ఉదుటున వ్యాన్ ముందుకు దూసుకుపోయి ఆమె ఢీకొట్టిం ది. ఈమెకు భర్త పాపారావు, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

పాతపాడులో పూరిల్లు దగ్ధం

నరుబుజ్జిలి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలికిపెంట పంచాయతీ పాతపాడు గ్రామంలో నివగాన ముఖలింగానికి చెందిన పూరిల్లు గురువారం దగ్ధమైంది. ఈ ఘటనలో బట్టలు, ఇంటి సామగ్రి, ధాన్యం కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో..

లావేరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో గురువారం గుర్రాలపాలెం గ్రామానికి చెందిన నేతల పెంటయ్య ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో టీవీ, రూ.25వేలు నగదు, రెండు బంగారం ముక్కు పుడకలు, జ్యోతికుమార్‌కు చెందిన ధ్రువపత్రాలు, దుస్తులు కాలిబూడిదయ్యాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

బాణసంచా స్వాధీనం

నరసన్నపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉర్లాం గ్రామంలో ఎటువంటి అను మతులు లేకుండా బాణాసంచా సామగ్రి విక్రయిస్తున్న బి.నాగరాజును అదుపులో కి తీసుకొని అతని వద్ద నుంచి రూ.27వేల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని హెచ్‌సీ దాలినాయుడు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు నాగరా జుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చెరువులో పడి కూలీ మృతి

నరసన్నపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివనగర్ కాలనీకి చెందిన బగ్గు సూర్యనారాయణ (45) గెడ్డయ్య చెరువులో స్నానం కోసం వెళ్లి ప్రమాదవ శాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు హెచ్‌సీ దాలినాయుడు శుక్రవారం తెలి పారు. సూర్యనారాయణ స్నానం కోసం బుధవారం రాత్రి వెళ్లి ఒక్కసారి తూగి పోయి నీటిలో మునిగిపోయినట్లు తెలిపారు. భార్య నరసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని బయటకు తీసి నరసన్నపేట ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసినట్లు తెలిపారు.

'అనంత'లో కర్పూరం పరిశ్రమలో ప్రమాదం

- బాధితులలో ఒకరు శ్రీకాకుళం వాసి



వెంటిలేటర్‌పై ఉన్న లక్ష్మణరావు

శింగనమల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అనంత పురం జిల్లా శింగనమల మండల పరిధిలోని కొత్తపల్లి వద్ద ఉన్న సప్తగిరి క్యాంఫర్ పరిశ్రమలో ఆర్-3 రియా క్టర్‌కు మరమ్మతులు చేస్తుండగా విషవాయువులు వెలువడ్డాయి. వెల్డింగ్ చేస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని సమా చారం. రియాక్టర్ నుంచి వెలు వడిన ఐసో బ్రొనైల్ అసిటేట్ వాయువును పీల్చిన ఆరుగురు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్ష్మణరావు ఉన్నారు. వీరిని అనంత పురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిం చారు. రియాక్టర్‌కు వెల్డింగ్ చేస్తున్న సమ యంలో విష వాయువులు వెలువడటంతో కార్మికులు ఊపిరి అందక తీవ్ర అస్వస్థ తకు గురయ్యారు. బాధితులలో లక్ష్మణరావు, నాగేంద్ర ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో వెంటిలేషన్‌పై చికిత్స అందిస్తున్నారు.

సంకుజోడికి నిధులు మంజూరు చేయండి

హరిపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మందస మండలం మఖరజోల పంచా యతీ పరిధి సంకుజోడి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని పిడి మందస ఎంపీటీసీ వాయిలపెల్లి మాధవరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీష సమక్షంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడులకు వినతిపత్రాలు అందజేశారు.

అర్ధాంతరంగా నిలిచిన భవనం



అసంపూర్తిగా ఉన్న ఆసుపత్రి అదనపు భవనాలు

కోటబొమ్మాళి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఆసుపత్రిలోని 30 పడకల నూతన భవనం పనులు అర్ధాంతరంగా నిలి చిపోయాయి. సుమారు ఆరేళ్లుగా నిర్మాణ దశలోనే ఉన్నాయి. ప్రస్తుత భవ నంలో వైద్య సేవలకు ఇబ్బం దులు కలుగుతున్నాయి. పైగా ఇరు కు గదులతో ఇటు రోగులు, అటు వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడు తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి న తరువాత మంత్రి స్పష్టమైన ఆదే శాలిచ్చినా నేటికీ పనుల్లో పురోగతి లేకపో వడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి రోగులకు వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకర ప్రయాణం



లగేజీ ఆటోలో వెళుతున్న కూలీలు, మిక్చర్ మిషన్

ఎల్.ఎన్.పేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిత్రాన్ని చూస్తున్నారుగా.. ఓపెన్ టాప్ వ్యాన్‌లో కూలీలు, దానికి అను బంధంగా మిక్చర్ మిషన్ ఎంతో ప్రమాదకరంగా ఉందో.. నిత్యం ఎక్కడో ఒక దగ్గర ప్రమాదాలు జరుగు తున్నా వారి తీరులో మార్పు రావడం లేదు. పరిమితికి మించి ప్రయాణికులు, బరువులను ఇలా తీసుకు వెళుతూనే ఉన్నారు. శుక్రవారం సోంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలోనూ కూలీలు గాయాల బారిన పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే అలికాం- బత్తిలి మార్గంలో ఇలాంటి చిత్రాలు కనిపిస్తూనే ఉన్నాయి. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాల్లో పింఛన్ల సందడి

జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ పండగలా శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీ పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



లావేరు: బుడుమూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



శ్రీకాకుళం రూరల్: తండ్యాంవలసలో పింఛన్ ఇస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్



పొందూరు: కింతలి గ్రామంలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్



పాతపట్నం/మెళియాపుట్టి: పింఛన్ ఇస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పోలాకి: జడూరులో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఇంటర్వ్యూ

అధిక దిగుబడులపై అవగాహన సదస్సులు

- ఏవో లతాశ్రీ



ఎల్.ఎన్.పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పంటల్లో అధిక దిగు బడి సాధించేం దుకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహి స్తున్నామని వ్యవసాయాధికారి పి.లతాశ్రీ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

ప్రశ్న: మండలంలో పంటలకు సంబం ధించి ఎంత విస్తీర్ణం ఉంది?

జవాబు: 22 పంచాయతీల పరిధిలో 9,919 ఎకరాలు విస్తీర్ణం వుంది. 8,761 మంది రైతులు పంటల సాగు చేస్తున్నారు.

ప్ర: అన్ని గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారా?

జ: రైతు పండించిన పంటలకు సకాలం లో ఈ-క్రాప్ నమోదు చేయడం జరుగు తుంది.

ప్ర: ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించి ఎరువులను సరిపడినంత అందిస్తున్నారా?

జ: మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రభు త్వ ధరల ప్రకారం రసాయనిక ఎరువులను అందించడం జరుగుతోంది.

ప్ర: యంత్ర పరికరాలతో సాగుపై అవగాహన కలిగిస్తున్నారా?

జ: యంత్రపరికరాలతో పంటలను సాగు చేసే పద్ధతులపై రైతులకు గ్రామాల్లో అవగా హన కలిగిస్తున్నాం. దీనివల్ల తక్కువ పెట్టు బడులతో అధిక లాభాలను పొందవచ్చని సూచిస్తున్నాం.

నేడు ఎర్రన్నాయుడు వర్ధంతి

టెక్కలి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దివం గత నేత, కేంద్రమాజీ మంత్రి కింజరాపు ఎర్ర న్నాయుడు 12వ వర్ధంతిని శనివారం ఉద యం 9గంటలకు నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి ఒక ప్రక టనలో తెలిపారు. చిన్నబజారు, హైవే పక్కన ఉన్న పార్కుల్లో ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

'సీర' సేవలు మరువలేనివి

హరిపురం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి మాజీ ఎంపీపీ సీర నాగేశ్వరరావు చేసిన సేవలు మరువలేనవని మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. డిమిరి యా గ్రామంలో నాగేశ్వరరావు 12వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు జీకే నాయుడు, బావన దుర్యోధన, రట్టి లింగ రాజు, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతను అరికట్టేందుకు చర్యలు

పోలాకి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మ హిళల్లో ముఖ్యంగా గర్భిణుల్లో రక్తహీనతను అరిక ట్టేందుకు ప్రభుత్వం గ్రామాల్లో ఫ్యామిలీ ప్రోగ్రాం శిబిరాలను నిర్వహిస్తోందని అడిష నల్ డీఎంహెచ్‌వో, నోడల్ అధికారి డా. తాడేల శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం దీర్ఘాశి శిబి రాన్ని సందర్శించారు. వైద్యాధికారి శ్రీనాథ్, డీపీఎంవో వాన సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నేటినుంచి కార్తీక ఉత్సవాలు

జలుమూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగ క్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగా వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో పి.ప్రభాకర రావు తెలిపారు. ఉచిత, ప్రత్యేక దర్శనాలకు వేర్వేరు క్యూలైన్లతో పాటు ఎండ తగలకుండా షామియానాలు, తాగునీటి సదుపాయం కల్పించినట్లు చెప్పారు.

అమరజీవికి ఘన నివాళి

నరసన్నపేట/జలుమూరు/వజ్రపుకొత్తూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జలుమూరు ఎంపీపీ పాఠశాల, డోకుల పాడులో ప్రేరణ యూత్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్రా వతరణ కోసం శ్రీరాములు చేసిన పోరాటాన్ని వివరించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నింట్లో తలదూరిస్తే..

వజ్రపుకొత్తూరు, నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి): అన్ని వ్యవహారాల్లో తలదూరిస్తే ఇలా గే ఉంటుందని పలువురు గుసగుసలాడు కున్న ఘటన శుక్రవారం వజ్రపుకొత్తూరులో సంభవించింది.. పూండి బస్టాండ్ వద్ద ఓ వీధి కుక్క ముఖం ఓ డబ్బాలో ఇరుక్కుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. దీంతో ఆ ఇబ్బందిని తొలగించేందుకు అనేక మంది ప్రయత్నించినా అది భయంతో పరుగులు తీసింది. ఎట్టకేలకు స్థానిక యువకులు శ్రమించి ఆ కుక్కను పట్టు కుని ఆ డబ్బాను తొలగించారు. దీంతో అది ఆనందంగా అక్కడి నుంచి వెళ్లిపోయింది.



డబ్బాలో ఇరుకున్న కుక్క ముఖం

సర్వర్ డౌన్‌తో పింఛన్ల పంపిణీకి ఆటంకం

- మూడున్నర గంటల పాటు లబ్ధిదారులకు ఇక్కట్లు



నరసన్నపేట: పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులు



నందిగాం: కొత్తగ్రహారంలో పింఛన్ ఇచ్చేందుకు సర్వర్ కోసం వేచి ఉన్న పీడీవో, ప్రత్యేకాధికారి

నరసన్నపేట/నందిగాం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ప్రతినెలా ఒకటో తేదీన పంపిణీ చేయాలని ఆదేశించింది. ఈ నేప థ్యంలో శుక్రవారం పింఛన్ల పంపిణీకి సర్వర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యలతో సుమారు మూడున్నగ గంటల పాటు ఇబ్బందులు ఎదురయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఉద యం 5.30 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమై 7.30 గంటలు వరకు నిరంతరంగా సాగింది. ఒక్కసారి సాంకేతికపరంగా యాప్‌లో సమస్యలు తలెత్తడంతో పింఛ న్ పంపిణీ ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారు. అయి తే అప్పటికే జిల్లా వ్యాప్తంగా 55శాతం మేర పింఛన్లు పంపిణీ చేశారు. సాంకేతిక సమస్యలను సిబ్బంది ఎంపీడీవోలకు సమాచారం అందించగా వారు డీఆర్‌డీఏ పీడీ దృష్టికి తీసు కువెళ్లారు. ఆయన స్పందించి తగు చర్యలు తీసుకోవడంతో ఉదయం 11 గంటల నుంచి తిరిగి పింఛన్ల పంపిణీ ప్రక్రి య ప్రారంభమైంది. నరసన్నపేట పంచాయతీ కార్యాల యానికి వచ్చిన వారికి ముందుగా పంపిణీ చేశారు. ఆ తరువాత ఇళ్ల వద్దకు వెళ్లి మిగిలిన వారికి అందించారు. నందిగాంలో మధ్యాహ్నం వరకు 75శాతం మేర పంపిణీ జరిగింది. ఈ విషయమై నరసన్నపేట ఎంపీడీవో మధు సూదనరావు వద్ద ప్రస్తావించగా సాంకేతిక సమస్య ఏర్పడ డం వాస్తమేనని.. అయితే ఉదయం 11 గంటల నుంచి స ర్వర్ పనిచేయడంతో మండలంలో 80 శాతానికి పైగా పం పిణీ చేశామని, మిగిలిన వారికి శనివారం అందజేస్తా మన్నారు.

ఆదివాసీ ఉద్యమాలకు కోరన్న, మంగన్న స్ఫూర్తి



కొండలోగాంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ, ప్రజా సంఘాల నాయకులు

హరిపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సమ స్యలపై సాయుధ ఉద్యమవీరులు కోరన్న, మంగన్న చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని సీపీఐఎంఎల్ న్యూ డెమో క్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. కొండలోగాం లో చిలకమ్మ స్మారక స్థూపం వద్ద శుక్రవారం కోరన్న, మంగన్న 57వ వర్ధంతిని నిర్వహించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన పల్లి కుసుమ, సన్నశెట్టి రాజశేఖర్, ప్రజా సంఘాల నాయ కులు గౌరకల బాలకృష్ణ, కుత్తుం వినోద్, పి.మల్లేశ్వరరావు, జాన కమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడవుల ప్రైవేటీకరణపై పోరాడదాం

వజ్రపుకొత్తూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో తొలి అమరులైన కోరన్న, మంగన్న స్ఫూర్తితో అడ వుల ప్రైవేటీకరణపై పోరాడదామని పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్రి దానేస్ అన్నారు. మర్రిపాడు అమరవీరుల స్థూపం వద్ద కోరన్న, మంగన్న 57వ వర్ధంతి ని సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి స్థూపానికి సీనియర్ నేత వంక మాధవరావు పూల మావేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన దీపావళి సంబరాలు



పలాస: కుటుంబంతో కలిసి దీపావళి పండుగను చేసుకుంటున్న ఎమ్మెల్యే గౌతు శిరీష



నరసన్నపేట బీసీ వసతిగృహంలో దీపావళి పండగను చేసుకుంటున్న విద్యార్థినులు

నరసన్నపేట/పోలాకి/ పలాస/పాతపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల్లో గురువారం దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. పోలాకి మండలం మబు గాంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుటుంబ సమేతంగా దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. పలాసలో ఎమ్మెల్యే గౌతు శిరీష ఇంట దీపావళి సందడి నెలకొంది. తండ్రి శివాజీ దంపతులు, భర్త వెంకన్న చౌదరి తదితరులు సంబరాల్లో పాల్గొ న్నారు. నరసన్నపేట బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాల్లో దీపావళి సందర్భంగా దీపాలం కరణ చేశారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణ చేశారు. పాతపట్నం షిర్డీగిరిపై సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు.



పాతపట్నం: షిర్డీగిరిపై దీపాలంకరణ దృశ్యం

సత్యసాయి విద్యార్థుల సామాజిక సేవ

పలాస, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు శుక్రవారం సామాజిక సేవలో పాల్గొన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీని పొదుపు చేసి ఆ మొత్తంతో యాచకులకు ఆహారం, స్వామి ప్రసాదం పంచిపెట్టారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ.. సత్యసాయిబాబా ఇచ్చిన ప్రేరణతో విద్యార్థులు తమ సొంత డబ్బులతో ఇటు వంటి సేవ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమం లో ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యాచకులకు అన్నప్రసాదం అందిస్తున్న విద్యార్థులు

న్యూస్ బాక్స్

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు

ఎల్.ఎన్.పేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మద్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని ఎక్సైజ్ ఎస్ఐ కావ్య హెచ్చరిం చారు. లక్ష్మీనర్సుపేట జంక్షన్, లక్ష్మీనర్సు పేట గ్రామాల్లోని మద్యం దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. మద్యం కొను గోలు, విక్రయాలకు సంబంధించిన ఎప్పటి కప్పుడు రికార్డులను అప్‌డేట్‌గా ఉంచా లన్నారు.

జీడి కార్మికుడికి సాయం

పలాస, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా పనిచేస్తున్న జీడి కార్మికుడి కుటుంబానికి కార్మికసంఘ నాయకులు రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు. కార్మికురాలు కవితాపాత్రో భర్త దామోదర్‌పాత్రో అనారోగ్యంతో శ్రీకాకుళంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. ఆయన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో నాయకులు ఈ మొ త్తాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

పోర్టును ప్రైవేటుపరం చేస్తే ఉద్యమం

సంతబొమ్మాళి, నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో 70 శాతం పూర్తయిన మూలపేట పోర్టును ప్రైవేటుపరం చేస్తే ప్రజా ఉద్యమం తప్ప దని టెక్కలి నియోజకవర్గ వైసీపీ సమన్వ యకర్త పేరాడ తిలక్ అన్నారు. శుక్రవారం సీతానగరంలో విలేకరులతో మాట్లాడుతూ.. పోర్టు ను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగిస్తే ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. దీనిని అన్ని వర్గాల వారు ఖండించాలన్నారు. శరవేగంతో జరుగుతున్న పోర్టు పనులను కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని నెలల పాటు నిలుపుదల చేసి ఇప్పుడు కమీషన్లు, కాంట్రాక్టర్ పనుల కోసం పునఃప్రారంభించారని విమర్శించారు. కార్య క్రమంలో భావనపాడు సర్పంచ్ బుడ్డా మోహ న్‌రెడ్డి, నౌపడ-2 ఎంపీటీసీ బచ్చల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విధానాలతోనే దేశాభివృద్ధి

టెక్కలి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ విధానాలే దేశాభివృద్ధికి శరణ్యమని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిం చారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కోత మధు, నేతలు టీటీజీ గుప్త, పొట్నూరు ఆనందరావు, ఉమామహేశ్వర రావు, మాధవరావు, సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై మిశ్రమ దాణా

మందస, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ఉపయోగపడే సంపూర్ణ మిశ్రమ దాణా రాయితీపై అందజేస్తున్నట్లు మందస, హరిపురం పశువైద్యాధికారులు డి.శ్రీకాంత్, ఉమాభారతి ఒక ప్రకటనలో తెలిపారు. దాణా కావాల్సిన పాడి రైతులు రైతు సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకో వాలని సూచించారు.